# అతిథి సత్కారం

రమామనోహర్

"ఇదిగో చెప్తా వినండి. మనదేశంలో సూర్యనారాయణలాంటి మనుషులున్నంతవరకూ దేశం ఇల్లాగే యేడుస్తుందండి."

సూర్యనారాయణ అంటే ఎవరో కాదు లెండి. మావాడే. మా అమ్మమ్మ...పినతల్లి తమ్ముడికి సయామూ మునిమనవడండి.

వాడిప్పుడు మద్రాసులో చదువుతున్నాడు లెండి. ఇహ వాడి డాబు, దర్పం గురించి చెప్పాలంటే వ్యాఖ్యానసహితంగా భారతం చెప్పి నన్ని రోజులు పడుతుందండి.

అసలు సంగతి యేమిటంటే, నెలరోజుల క్రితం నేను కోర్టుపనుండి మద్రాసు వెళ్ళానండి. సెంట్రలులో దిగి, ఏ హోటలుకు పోదామా అని ఆలోచిస్తుంటే వీడు అక్కడ తటస్థ పడ్డాడండి.

"పోనీ పరాయిదేశంకదా, మనవాడు వచ్చాడు. మాటా మంచీ అడుగుదాం బసకుదిరిందో లేదో కనుక్కుందాం పాపం" అన్న జ్ఞానంవాడికి వుంటేనా? పైగా చూసీ చూడనట్లు వెళ్ళిపోబోయాడండి.

నే నూరుకొంటానూ? "ఒరేయ్, సూరయ్యా!" అని ఒక పొలికేక పెట్టి వాణ్ణి పిల్చానండి.

ఇక తప్పని సరిగా దగ్గరకువచ్చి "మీరా, గుర్తుపట్టలేదు" అన్నాడండి. కొంతసేపు మాట్లాడామండి. యెంతసేపు చూసినా ఏవో అవీ ఇవీ వాగాడు గాని నన్ను వాళ్ళ హాస్టలుకు రమ్మని పిలువలేదండి. "పోన్లే కుర్రకుంక వీడికి మర్యాదలు ఏం తెలుసు" అని తమాయించుకొని వాళ్ళ నాన్నకూ నాకూవున్న పరిచయం పురస్కరించుకొని, నేనే చొరవచేసి "ఒరేయి నాయనా మీ హాస్టలుకు పోదాం పదరా" అన్నానండి.

వాడు అప్పటికైనా బయలుదేరాలా? అదేం లేకుండా "మా హాస్టలు భోజనం మీరు తింటారా?" అని అడిగాడండి.

"ఏం, యెందుకు?" అన్నానండి.

"ఎబ్బే ఏంలేదు, మా హాస్టలులో ఇద్దరు సాయిబులూ, నలుగురు క్రిష్టియనూవున్నారు. వాళ్ళూ మేమూకలిసే భోజనంచేస్తాం" అన్నాడండి.

కానిదేశంవచ్చిన తర్వాత ఆచారాలు ఎల్లాగో భ్రష్టమవుతాయిలే అనుకొని "ఫరవాలేదు తింటాను" అన్నానండి.

అప్పటికీ వాడు వూరుకోలేదండి "మాహాస్టలులో నెయ్యి ఒక్క గరిటకంటె చచ్చి గీపెట్టినా వెయ్యరు" అన్నాడండి.

"అది చాలు" అన్నానండి.

"పైగా కొబ్బరినూనెతో చేస్తారు వేపుళ్ళు" అన్నాడండి.

"ఓ, నాకు కొబ్బరినూనె ఒంటికి పడుతుంది. భయంలేదు" అన్నానండి.

ఇక తప్పని సరిగా వాళ్ళ హాస్టలుకు తీసుకుపోయాడండి.

## విన్నారా?

(ఆర్ట్ ఇన్ ఇన్డస్ట్రి ఎగ్జిబిషన్). ఇది 1941 లో స్థాపింపబడింది. దీని ఉద్దేశం పరిశ్రమలలో కళను బాగా ప్రోత్సహించడం. ఏటేటా ప్రదర్శనాలు ఏర్పాటుచేస్తారు. కళాపాండిత్యం బాగా కనబర్చే వస్తువులను తయారుచేసేవారికి బహుమతులిస్తారు.

1945 వ సంగరము ప్రదర్శనం—31-1-1945 తేదీనాడు బొంబాయిలో జె. జె. స్కూల్ ఆఫ్ ఆర్ట్సులో జరుగుతుంది దీని యాజమాన్యమంతా బర్మా షెల్ కంపెనీవారిది. ఈసారి బహుమతులు మొత్తం 25000 రూపాయలుంటాయట.

ఈసారి ప్రదర్శనంలో ముఖ్యవిషయం: ఈసంస్థ అఖిలభారత సంస్థగా రిజిష్టరు కాబోతోంది. ప్రదర్శనమును బొంబే గవర్నరుగారు ప్రారంభిస్తారు.

వాడు చెప్పినట్లు భోజనం చాలా దరిద్రంగా వుందండి. సాయిబులూ వాళ్ళూ వున్నారుగాని నేనున్న వారంరోజులూ భగవంతుడి దయవల్ల నా పంక్తికి రాలేదులెండి. నాకు తిండి సయించేది కాదండి. ఏదో నాలుగు మెతుకులు కొరికే వాడినండి.

వెళ్ళిన పని నాలుగురోజుల్లో అయిపోయిందండి. పోనీ ఇంతదూరం రానే వచ్చాం, మద్రాసు నాలుగుమూలలా చూసి వెడదామనుకొని వాడితో "ఇంకో నాలుగురోజులుండి వెళతానురా సిటీచూసి" అన్నానండి.

వాడు "సరే" నన్నాడండి.

మద్రాసు తీరిగ్గా నాలుగురోజుల్లో చూసి అయిదోరోజు ప్రయాణమయానండి. వాడంటే మన్ని పిలవనన్నా పిలవలేదు కాని, మనకు యిన్నాళ్లు అక్కడ వున్నందుకు కృతజ్ఞత చూపాలన్నయిది వుంటుంది గదండీ. అందుకని వాడిని పిలచి "నీకు యిన్నాళ్లబట్టీ చాలాశ్రమ యిచ్చాను. నువ్వేదో మంచివాడివి కాబట్టి..." అని చెప్పవలసిన మాటలు చెప్పబోయానండి.

వాడు మధ్యలో అందుకొని "దానికేమి లెండి. మనలో మనం సహాయం చేసుకోటంలో గొప్పయేమీ లేదులేండి" అంటూ "యిది కొంచెం చూడండి" అని ఒక కాయితం యిచ్చాడండి.

అది చూచేటప్పటికి మీకేం చెప్పను? నాలో పైత్యపు తెరవచ్చి కళ్లుగిర్రున తిరిగాయండి. నాఒళ్లు నా స్వాధీనంలోనుంచి తప్పిపోయినట్టుందండి.

ఆ కాగితంలో వాళ్ళ హోటలులో నేను చేసిన భోజనంఖర్చూ, టిఫిన్లఖర్చూ, తరువాత వాడు నాకోసం ఖర్చుపెట్టిన డబ్బూ దమ్మిడీలతోసహా దాన్లో వివరంగారాసి యున్నాయండి. ఆఖరికి అన్నీకలిపి 15 రూపాయల పావలా బిల్లు అయిందండి. ఏం చెయ్యను? మెల్లిగా "నాదగ్గిర డబ్బు తక్కువగా వున్నట్టుందిరా" అని చూశానండి. కాని వాడు నమ్మలేదండి.

ఎందుకంటే—చెప్పటం మర్చిపోయాను — వెళ్ళగానే నాదగ్గరుంటే అటూయిటూ పడిపోతుందని వందరూపాయిలున్న మనీపర్సు దాచమని వాడికిచ్చానండి. దాంతో వచ్చిందండి తంటా!

## తిప్పి తిప్పి....

నా సలహా  
తరహాలను చూచి  
చక్కనివని  
పక్క లెగరేస్తూ  
ఇకిలింపులతో  
బుజాలెగరేసే  
పరమహితుల (పాడు పీనుగలు!)  
ప్రోత్సాహానికి  
ఉత్సాహంతోడై  
కుంగిపోబోయి  
పొంగిపోతూ  
ఇంకా రాయాలని  
విదిలించిన కలం  
నేలకు కొట్టుకుని  
విరిగిపోయిన  
పాళీవైపు  
వెఱ్ఱిమొహంతో  
చూస్తున్న  
నన్ను చూచి  
అయ్యో! య్యో!!  
అన్నవాళ్ళని  
తిప్పి తిప్పి కొట్టబోయి  
గురి తప్పి  
కింద పడబోయిన నాకు  
పిచ్చెక్కిందన్నవాళ్ళ  
పిచ్చెలా వదుల్తుందా  
అని  
ఆలోచనలో  
మునిగిపోయిన నా పని  
అరకప్పు కాఫీతో  
సాఫీ అయింది.

—మిస్ నీనా.